# వేదన

■ డాక్టర్ గాయత్రీదేవి

ఆ రోజు నుండే నాకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో పోస్టింగ్. ఆ యూనిట్‌లో బాగా అనుభవం సంపాదించాలనీ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సరైన సేవ చేసి, వారి ప్రాణాలు కాపాడాలనీ, వారి ముఖంలో మెరుపు లాంటి చిరునవ్వు చూడాలనీ, ఆ చిరు నవ్వు నాకు కలిగించే సంతృప్తిని అనుభవించాలనీ, జన్మ సార్థకం చేసుకోవాలనీ ఉత్సాహంగా డ్యూటీకి వెళ్ళాను.

నాలో ఏదో ఉద్వేగం...

నా మనసులో కొత్త భావపరంపర...

నా మొహంలో నాకే తెలుస్తున్న కొత్త వెలుగు...

నాలో అంతకు ముందెప్పుడూ లేదీ ఉత్సాహం...

నాకు నేనే అపర బ్రహ్మగానో, ఆయన అసిస్టెంటుగానో భావించుకుంటున్నట్లున్నాను- హౌస్ సర్జన్ ట్రయినింగ్‌లో ఉన్న నేను.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐ.సి.యు)లో నేను అడుగు పెట్టగానే ఒక కేసు వచ్చింది. పేషెంటు ఎనభై ఏళ్ళ వృద్ధుడు. అపస్మారక స్థితిలో ఉన్నాడు. వార్డు బోయస్ స్ట్రెచర్ మీద తీసుకొచ్చారు. ఆ వృద్ధుడితో వచ్చిన బంధువుల ముఖాలు ఆందోళనగా ఉన్నాయి. ఆ సమయానికి అక్కడ నేను ఒక్కర్తినే ఉన్నాను.

"మీరేం కంగారు పడకండి. కేస్ హిస్టరీ చెప్పండి. మేము చూసుకుంటాం. భారం మా మీద వేసి మీరు నిశ్చింతగా ఉండండి" అన్నాను వాళ్ళకి ధైర్యం చెబుతూ.

"డాక్టర్, ఆయన మా తాతగారు. ఆరు నెలల క్రితం కాలు జారి పడిపోయారు. తుంటి ఎముక విరిగిందన్నారు డాక్టర్లు. ఆపరేషన్ చేస్తేనే కానీ నడవలేడన్నారు. చేయించాం. ఆ తరువాత ఆయన లేచి నడవలేదు సరికదా, కాళ్ళకి స్పర్శ జ్ఞానం కూడా పోయింది. ఈ ఆరు నెలలుగా అన్ని కార్యక్రమాలూ మంచం మీదే. ఈ రోజు ఉదయం నుంచీ స్పృహ లేకుండా ఉన్నారు" అని చెప్పాడు రోగి మనుమడు.

నేను మరికొన్ని వివరాలు అడిగి తెలుసుకున్నాను. ఈలోగానే నర్స్, పేషెంటుని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లోపలికి తీసుకెళ్ళింది. నేను కేస్‌షీట్ తయారుచేశాను.

ఎలాగయినా ఆ పేషెంటు బతకాలనీ, అతని ముఖంలో చిరునవ్వు చూడాలనీ, అతని బంధువులందరికీ ఆనందం కలిగించాలనీ, మనఃస్ఫూర్తిగా అనుకున్నాను. నా మొదటి కేసుని విజయవంతం చెయ్యమని పరమేశ్వరుణ్ణి ప్రార్థించాను.

ఇంతలో యూనిట్ చీఫ్ వచ్చారు.

పేషెంటుని పరీక్ష చేశారు.

నాకూ, నాకంటే అనుభజ్ఞురాలయిన యూనిట్ నర్స్‌కీ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి వెళ్ళిపోయారు.

నర్స్ సహాయంతో ఇ.సి.జి మానిటర్ ప్లగ్గులు పేషెంటుకి కనెక్ట్ చేశాను. ముక్కుకు ఆక్సిజన్ మస్క్ తగిలించింది నర్స్. సక్షన్ ఆపరేటస్ ఆన్‌చేసి, ముక్కులోంచి గొట్టం పంపి లంగ్స్‌లో ఎక్కువగా ఉన్న ఫ్లూయిడ్స్ తియ్యడం మొదలుపెట్టాం. మూత్రం బంధించుకుపోయి ఉండడంతో, కేథెటర్ ప్రవేశపెట్టాం. కొన్ని మందులు సెలైన్ బాటిల్‌లోకి ఎక్కించి, డ్రిప్ పెట్టాం.

హఠాత్తుగా ఇ.సి.జి మానిటర్‌లో కొన్ని మార్పులు కనిపించాయి నాకు. గబగబా కార్డియాక్ మసాజ్ మొదలుపెట్టాను. త్వరగా చీఫ్‌ని పిలవమని నర్స్‌తో చెప్పాను. ఆవిడ నిర్లిప్తంగా చీఫ్‌కు ఫోన్ చేసింది. చీఫ్ వచ్చేసరికే సిస్టర్ ఇంజక్షన్ లోడ్ చేసి సిద్ధంగా ఉంచింది. ఆయన ఆ ఇంజక్షన్‌ని నేరుగా రోగి గుండెలోకి చేశాడు. ఇ.సి.జిలో రోగి గుండె పరిస్థితి నయమయినట్లు కనబడింది.

లేబొరేటరీ టెక్నీషియన్ వచ్చి రోగి రక్తం, మూత్రం తీసుకెళ్ళాడు రకరకాల పరీక్షల కోసం. ఎక్స్‌రేలు, స్కాన్‌లు అయ్యాయి. రోజూ ఇటువంటి కేసులకు అలవాటుపడిన నర్స్ యథాలాపంగా పనులు చేసుకుంటూ, మధ్యమధ్యలో బయటికి వెళ్ళిపోతోంది. నేను మాత్రం ఆ గది వదలలేదు, కన్ను మానిటర్ మీద నుండి తిప్పలేదు.

లాబ్ నుండి రిపోర్ట్స్ వచ్చాయి. కిడ్నీస్ సక్రమంగా పని చెయ్యడం లేదని చూపిస్తున్నాయి కొన్ని రిపోర్టులు, మిగిలినవన్నీ నార్మల్‌గానే ఉన్నాయి.

పేషెంట్ పరిస్థితి స్టేబుల్‌గా ఉన్నట్లు తోచింది నాకు. నైట్ డ్యూటీ డాక్టర్ రావడంతో నేను అతనికి అన్నీ వివరంగా చెప్పి బయటికి వచ్చాను.

అక్కడ రోగి బంధువులు ఆత్రంగా చూస్తూ ఉన్నారు. ప్రశ్నార్థకంగా చూస్తూ నా దగ్గరికి వచ్చారు.


అంతవరకూ వాళ్ళకి ఎవరూ రోగి పరిస్థితి తెలియజెయ్యలేదని తెలుసుకుని బాధపడ్డాను. అంతలోనే వారికి అభయమిస్తున్నట్లుగా నవ్వి "మీరేం భయపడక్కర్లేదు. ఆయనకు ప్రాణాపాయం లేదు. ఇప్పుడు వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందింది. ఉత్తమ వైద్యం చేస్తున్నాం. ఒక పరిస్థితిలో గుండె ఆగిపోతుందేమోనని భయపడ్డాం. కానీ, ఆయన మందులకు బాగా రెస్పాండ్ అయ్యారు. నేను మళ్ళీ రేపు పొద్దున్నే వస్తాను" అన్నాను.

"తాతగారు స్పృహలోకి వచ్చారా?"

"ఇంకా లేదు."

"ఒకసారి లోపలికి వెళ్ళి మేము ఆయన్ని చూడచ్చా?"

చిత్రం: నర్సిం



"మీరు లోపలికి వెళ్ళడం వలన ఆయనకు ఇన్‌ఫెక్షన్లు రావచ్చు. మేమున్నాంగా, మీకెందుకు బెంగ" అంటూ అక్కణ్ణుంచి కదిలాను నేను.

* * *

ఆ వృద్ధుణ్ణి ఐ.సి.యులో చేర్పించి వారం రోజులు అయింది. నా డ్యూటీలో మొదటి కేసు విజయవంతం అవుతుండడం నాకెంతో ఆనందంగా తోచింది. కాస్త గర్వం కూడా.

ఆ పూట కిడ్నీస్ ఫెయిల్ అవుతుండడంతో డయాలిసిస్ ప్రారంభించాం. రెస్పాన్స్ బాగానే ఉంది.

తరువాత ఇన్‌స్ట్రక్షన్ కోసం చీఫ్ డాక్టర్ దగ్గరికి వెళ్ళాను.

తిరిగి ఐ.సి.యుకి వెళ్ళబోతున్న నాకు రోగి తరఫువారితో ఎవరో మాట్లాడుతుండడం వినబడింది. ఆ మాటలు నన్ను ఆకర్షించాయి.

"పెద్దయ్యగారికి ఎట్టా ఉంది బాబూ?"

"బా...గా...నే ఉంది అంటున్నారు డా...క్ట...ర్లు."

"బాగానే ఉంటే మనింటికి తీసుకెళ్ళిపోదాం అయ్యా."

"ఇంటికి తీసుకెళ్ళడం ఎలాగే. ఆయన స్పృహలో లేరు."

"ఇప్పుడే కదా బాగానే ఉన్నారన్నారు."

"డాక్టర్లు చెప్పిన మాటే."



"శవం లాంటి ఆ బాబుని మిషన్లతో గుచ్చిగుచ్చి...ఇక బాధపెట్టమాకండి తల్లీ. ఆ జీవుణ్ణి దేవుళ్ళో ఐక్కం అయిపోనీండి..."

"నేనో పాలి పెద్దయ్యగార్ని సూడాల బాబూ... నాను ఆయన కాడ కూకుంటాను, మీరిళ్ళకెళ్ళండి."

"ఆయన దగ్గర ఎవ్వరూ ఉండకూడదే లచ్చి."

"అయ్యో, లోన ఆ బాబు ఒక్కరే ఉన్నారా!"

"..."

"అయినవాళ్ళం ఇంతమందిమి ఉండి ఆయన్ని ఒక్కర్నీ ఉంచడం ఏంటండీ..."

"ఆ గదిలోకి మనం వెళ్తే ఆయన ఆరోగ్యానికి ప్రమాదం" అని వాళ్ళు చెబుతూంటే, నేను వారి దగ్గరగా వెళ్ళాను. ఇందాకట్నుంచి మాట్లాడుతున్న ఆ కొత్త వ్యక్తి వైపు ప్రశ్నార్థకంగా చూశాను.

దాదాపు అరవై ఏళ్ళున్నట్లున్న ఆ స్త్రీ తమ ఇంట్లో పనిమనిషి అనీ, గత నలభై ఏళ్ళుగా తమ ఇంటిని వదలకుండా సేవ చేస్తోందనీ, పేరుకి పనిమనిషే కానీ తమ కుటుంబానికి ఎంతో ఆత్మీయురాలనీ చెప్పారు వాళ్ళు. నేను డాక్టర్నని తెలుసుకుని లచ్చి, "అమ్మా, ఒక్కసారి మా అయ్యగార్ని చూడాలనుందమ్మా" అంది.

ఐ.సి.యు గదికి ఉన్న అద్దాల కిటికీ లోంచి చూపించాను ఆమెకు.

ఆ వృద్ధుణ్ణి చూడగానే ఆమె ముఖంలో విపరీతమైన బాధ కనపడింది నాకు.

"అమ్మా, అదేంటమ్మా మా అయ్యగారి ఒంటినిండా కరెంటు వైర్లూ, సూదులూ, గొట్టాలూ" అంది దుఃఖం ఆపుకుంటూ.

అక్కడ మాట్లాడొద్దని సైగ చేసి, ఆమెను వెయిటింగ్ హాల్ దగ్గరికి తీసుకెళ్ళాను.

"అవన్నీ మీ అయ్యగార్ని బతికించడం కోసం" అని ఆమె ప్రశ్నకు జవాబు చెప్పాను.

"ఎన్నాళ్ళు పెట్టాలమ్మా?"

"చెప్పలేం."

"ఇవన్నీ పెడితే మా అయ్యగారి ఒళ్ళు బాగైపోతుందామ్మా. ఇంటికెల్లినాక మా అయ్యగారు లేచి తిరుగుతారా? పాపం ఆరు నెల్ల నుంచీ మంచానికంటుకుపోనారూ..."

"ఆయన లేచి తిరగరమ్మా. అందుకు మందులేం లేవు."

"మరింక దేనికిస్తన్నారు మందులు."

"ఆయన ప్రాణాలు కాపాడడానికి."

"ఈ ఆస్పత్రిల ఆయనొక్కర్నే ఇడిగా ఉంచతన్నారు. మాతోని ఇంటికంపెయ్యండి. నలుగుర్తోనూ ఉంటే కాత్తంత నెమ్మదిగుంటది."

"అయ్యో అలా కుదరదమ్మా. ఆయన కిడ్నీస్ పనిచెయ్యడం లేదని ఈరోజే డయాలసిస్ చేశాం. ఫరవాలేదు. బాగానే రెస్పాండ్ అయ్యారు. ఆయన్ని ఆ గదిలోంచి కదపడానికి లేదు."

"ఏమ్మా?"

"ఆ మిషన్లు, గొట్టాలూ తియ్యడానికి వీల్లేదు."

"ఏమ్మా?"

"తీసేస్తే ఆయన ప్రాణం పోయే ప్రమాదం ఉంది. ఐ.సి.యులోనే ఉండాలి."

"ఆ గదిలోంచి బయటికి తెత్తేనే సచ్చిపోతారా మా అయ్యగారు?"

"అవును. ఈ ఆస్పత్రిలో ప్రాణాలు కాపాడడానికి కావలసిన మిషన్లన్నీ ఉన్నాయి. అదృష్టం కొద్దీ మీరు ఇక్కడికి తీసుకొచ్చారు. లేకపోతే ఈపాటికే..."

"అయ్యగారు కాత్తంత కన్నిప్పి సూత్తన్నారామ్మా? కాసిని పాలో, నీళ్ళో తాగుతున్నారా తల్లీ?"

"ఆయన కోమాలో ఉన్నారు. అంటే, స్పృహలో లేరు. అన్నీ గొట్టాలతో ఎక్కించాల్సిందే."

"ఈ మాటలన్నీ ఇంటుంటే మా అయ్యగారు బతికున్నారో, లేదో తెలీడం లేదమ్మా. ఆయన కన్నిప్పి సూడ్డు, పన్నిప్పి మాట్టాడ్డు. తినడు, తాగడు. అసలు మన లోకంలోనే లేడు. వారం రోజుల్నుంచీ ఇదే తీరు. మరో పక్క గొట్టాలు తీత్తే పానం గాలిలో కలిసిపోద్దంటన్నారు. ఆయన బతికున్నారని ఎట్టాగమ్మా అనుకోడం...

ఆరు నెల్ల నుంచీ మంచంలోనే ఉన్నాడు. పెద్ద వయసు. ఒళ్ళు బాగయ్యే వయసూ కాదు, మందులకి లొంగే జబ్బూ కాదు. మరో పక్క గొట్టాలు తీస్తే నిలబడే పానమూ కాదంటున్నారు. అల్లాంటప్పుడు ఎందుకమ్మా ఆ బాబుని ఇట్టా బాదపెడతన్నారు? నాతో ఎన్ని మార్లన్నారో, 'ఈ వయసులో ఈ బాధలన్నీ పడలేకపోతున్నానే. నాకు సచ్చిపోవాలనుందే. ఆ దేవుడికి నా మీద ఎప్పటికి దయ కలుగుద్దో' అని.

అందరం సుకంగా సచ్చిపోవాలని కోరుకునే వోళ్ళమే. అందరికీ ఆ అదురుష్టం ఉండదు కాదమ్మా. ఆ అయ్య బాధలు గట్టెక్కి సావొత్తుంటే, ఎందుకమ్మా అయన్ని ఇలా ఇంసిత్తన్నారు? ఆ పానం ఉండి ఎంత, లేక ఎంత? మోచ్చం కోసం ఆ జీవుడెంత కొట్టుకుంటున్నాడో. సివ్రరోజుల్లో అయినవాళ్ళ మద్దెన ఉండాలని, సొంతింటో పానం పోవాలనీ ఆయన మనసు ఎంత గిలగిలలాడ్తాందో... సొంత మనుషులు దేవుడి పార్ధన చేస్తుంటే, నాలుగు తులసి నీళ్ళు గొంతులో పోయించుకుని సొరగానికి పోడానికి లేకండా ఏంటమ్మా ఈ సిచ్చ? ఈళ్ళంతా ఆయన దగ్గరుండడానికి లేక ఎంత బాధపడతన్నారో సూడండమ్మా...

పోయే పానాన్ని సుకంగా పోనీక, సూదులూ, గొట్టాలూ గుచ్చిగుచ్చి ఇంకో రెణ్ణాళ్ళు ఆపి ఏం లాబమమ్మా... ఎవరికి లాబమమ్మా..." అంటూ ఆ పనిమనిషి ఇంకా ఏదో అడుగుతూనే ఉంది.

రోగి బంధువులెవరూ ఆమె మాటల్ని ఆపలేదు. వింటూ మౌనంగా తల వంచుకుని నిలబడి ఉన్నారు.

తమ మనసుల్లో మాటల్నే పనిమనిషి వ్యక్తం చేస్తోంది అనే భావన నాకు వారి ముఖాలలో కనబడింది.

"ఆఖరి నిమిషం వరకూ మనిషి ప్రాణాలు నిలబెట్టే ప్రయత్నం చెయ్యడం మా ధర్మం."

"పానాలు నిలబెట్టడం అంటే ఏటమ్మా... పానాలున్న మనిచి లచ్చణాలుండాల కదా... శవం లాంటి ఆ బాబుని మిషన్లతో గుచ్చిగుచ్చి... ఇక బాధపెట్టమాకండి తల్లీ... కొట్టుమిట్టాడుతున్న ఆ జీవుణ్ణి దేవుళ్ళో ఐక్కం అయిపోనీండి..."

నేనేనాడూ దృష్టి సారించని అంశంలో ఆలోచనలు నాలో రేకెత్తించాయి ఆమె మాటలు. ఆఖరి క్షణం వరకూ రోగి ప్రాణాలు కాపాడడమే డాక్టర్ ధర్మం అని నేను నమ్మిన మెడికల్ ఎథిక్స్‌కి కొత్త వ్యాఖ్యానం అవసరం అనిపించింది నాకు.

నిజమే. ప్రాణం నిలబెట్టడం వలన ఆ ప్రాణికీ ఏ మాత్రమూ ప్రయోజనం లేకపోతే?"

నిలబెట్టి ఎవరికి ప్రయోజనం!

"అమ్మా, నా మాటిని దయసేసి ఆ జీవుణ్ణింక బాధించకండమ్మా. గొట్టాలన్నీ తీసేసి మా అయ్యగార్ని మాతో పంపెయ్యండమ్మా. గొట్టాలు తీసెయ్యండమ్మా" అంటోంది ఆ పనిమనిషి.

ధర్మాధర్మ విశ్లేషణ చేస్తూ నా కర్తవ్యమేమిటో అర్థం కాక నిలబడిపోయాన్నేను. ■